కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు



బీఆర్‌యస్ పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, తదితరులు



నీటి ఎద్దడిని పరిష్కరించాం

ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నాం

- ఫ్లై ఓవర్‌లు, అండర్ పాస్‌లు నిర్మించాం
- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాం
- ఈ ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే..
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్ల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, శిరీష బాబురావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... తెలంగాణ రాకముందు కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలు ఒక వైపు ట్రాఫిక్ సమస్య, మరో వైపు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవారన్నారు. అలాంటి సమస్యలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాక నియోజకవర్గంలో ఫ్లై ఓవర్‌లు, అండర్‌పాస్‌లు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించామన్నారు.

360కి.మీ తాగునీటి పైపులైన్లు వేశాం..

అదేవిధంగా దాదాపు 360 కిలోమీటర్ల తాగునీటి పైపులైన్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీటిని అందించి ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కూకట్‌పల్లిలో నివసించే ప్రతి ఒక్కరూ తెలంగాణ బిడ్డలేనని అన్నారు. ప్రాంతాలను విభజించి పాలించొద్దని అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. తొమ్మిదేళ్లుగా కులాలు, మతాలు, ప్రాంతాలను అందరిని సమానంగా చూస్తున్న కేసీఆర్‌ను మరోసారి గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఎలాంటి గొడవలకు తావివ్వకుండా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే అది ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని అన్నారు.



మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

శాంతి భద్రతలకు నిలయం మన హైదరాబాద్

బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్లలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారే ఉన్నారన్నారు. వారంతా ఒకప్పుడు తెలంగాణ ఏర్పడితే ఎలా ఉంటుందో అనే అపోహ ఉండేదన్నారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ పరిస్థితి లేకుండా అందరూ తెలంగాణ బిడ్డలే అనే భావనతో చూశారన్నారు. కేపీహెచ్‌బీలో అనేక పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలను నిర్మించి వాటికి స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టామని గుర్తు చేశారు. నేడు హైదరాబాద్ మహానగరం శాంతి భద్రతలకు నిలయంగా మారి పెట్టుబడులకు స్వర్గధామంలా మారిందన్నారు.

స్థానిక నాయకులకు బీజేపీ, కాంగ్రెస్ అన్యాయం చేస్తున్నాయి...

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్నికలు రాగానే ఎన్నో ఏళ్లుగా స్థానికంగా పనిచేసే నాయకులను అన్యాయం చేస్తున్నాయని పేర్కొన్నారు. స్థానికులకు కాకుండా పారాచూట్ నేతలను తీసుకొచ్చి నమ్ముకున్న వారిని అన్యాయం చేసే గొప్ప పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ అని విమర్శించారు.

పార్టీలోకి 100 మందికి ఆహ్వానం...

ఈ సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 100 మంది బీఆర్‌యస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంగళరావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లు అభ్యర్థులను ప్రకటించుకునే స్థితిలో కూడా లేవు...

ఎంపీగా గెలిపించిన రేవంత్‌రెడ్డి ఏనాడైనా ఇక్కడకు వచ్చాడా అని ప్రశ్నించారు. బీజేపీ అయితే కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుతోందని విమర్శించారు. గొప్ప పార్టీలని చెప్పుకునే కాంగ్రెస్, బీజేపీలు నేడు అభ్యర్థులను కూడా ప్రకటించుకునే స్థితిలో లేవని ఎద్దేవా చేశారు. అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో తనను మరోసారి గెలిపించాలని కోరారు.

జంగ్ తెలంగాణ 2023

కాంగ్రెస్ పార్టీకి చిరుమర్తి రాజు గుడ్ బై

4వ తేదీన బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు వెల్లడి



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిరుమర్తి రాజు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14ఏళ్లుగా కాంగ్రెస్ కోసం ఎంతో కష్టపడ్డానని తెలిపారు. అయినా పార్టీలో ఎలాంటి గుర్తింపు లేదన్నారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు రాష్ట్రంలో ఎంతోమంది పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఎన్నో కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచారన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడినై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నానని ప్రకటించారు. ఈనెల 4వ తేదీన మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీల సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని గురువారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఓటర్లను అభ్యర్థించారు. డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్, వెంకటపాపయ్య నగర్, ఉజ్జయిని మహంకాళినగర్, చంద్రమ్మ కాలనీ, పంచమి కాలనీ, హనుమాన్ నగర్ తదితర కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు సమష్టిగా పనిచేసి బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు.

బీజేపీ అభ్యర్థికే కూకట్‌పల్లి టికెట్ కేటాయించాలి

మాధవరం కాంతరావు



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద మౌనదీక్షలో పాల్గొన్న కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బీజేపీ జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో కూకట్‌పల్లి అసెంబ్లీ టికెట్ ఖచ్చితంగా బీజేపీ అభ్యర్థికే కేటాయించాలని గురువారం అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయం ఎదుట మౌన దీక్ష చేపట్టారు. కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలతో ప్లకార్డులను పట్టుకొని దీక్షలో పాల్గొన్నారు.

- దీక్ష అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నామినేషన్ తేదీ దగ్గర పడుతున్నా కూకట్‌పల్లి అసెంబ్లీ స్థానానికి సంబంధించిన టికెట్ విషయంలో జాప్యం చేయడం అధిష్టానం మొండి వైఖరిని తెలియజేస్తోందన్నారు. ఇప్పటికే బీజేపీ మిత్రపక్షమైన జనసేనకే టికెట్ అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో వీటిని ఎప్పటికప్పుడు ఖండిస్తూ పలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నామని తెలిపారు.
- కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ సీనియర్ నాయకులందరం మూకుమ్మడిగా పార్టీ పదవులకు రాజీనామా చేశామని తెలిపారు. కనీసం ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధినాయకత్వం టికెట్ విషయంలో పునరాలోచనల చేయాలన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ అభ్యర్థి అరాచకాలు, ఆక్రమణలు ప్రశ్నించే బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్నారు. నియంతృత్వ విధానాలను అంతమొందించాలంటే కూకట్‌పల్లి బీజేపీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని కోరారు.
- ఇప్పటికే ప్రతి ఇంటింటికి, గడప గడపకు పువ్వు గుర్తును తీసుకెళ్లామన్నారు. అసెంబ్లీ ప్రాంతంలో బీజేపీకి అత్యధిక మెజార్టీలో గెలిపించుకుంటామని తెలిపారు. బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి బహుమతిగా అందజేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ దీక్షలో బీజేపీ నాయకులు సూర్యప్రకాష్, సూర్యరావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, షేక్ షాజహాన్, శ్రీనివాస్, పద్మయ్య, సురేందర్‌రెడ్డి, బీజేపీ మహిళా నాయకురాళ్లు, మోర్చాల విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

బాలానగర్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవం శుక్రవారం బాలానగర్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఏడీఈ పి.సూర్యప్రకాష్ తెలిపారు. రంగారెడ్డి, బాలానగర్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ఫిర్యాదులు, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొనివచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలు ఫోన్ నం.94408 12846లో సంప్రదించాలని కోరారు. రంగారెడ్డినగర్‌కు సంబంధించి ఫోన్ నం.83329 46982లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపుతాం

కూకట్‌పల్లి: విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఇంజినీర్ దాసరి చక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌కు రానున్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ దగ్గర ఉండి చేయించారు. ఉదయం 8గంటలకు శంకర్ ఎన్‌క్లేవ్‌లో 25కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. 9.30గంటలకు హెచ్ఏఎల్ పార్కు, 10గంటలకు వార్డు కార్యాలయం, 10.30గంటలకు సిండికేట్ బ్యాంక్‌కాలనీ, 11.30గంటలకు ఎల్‌బీనగర్, 12గంటలకు గంగపుత్ర సంఘం, 12 గంటల 30 నిమిషాలకు హరిజనబస్తీ, మధ్యాహ్నం ఒంటి గంటకు మోడల్ మార్కెట్, 3గంటలకు అబ్రహార్‌నగర్, 4గంటలకు అంజయ్యనగర్ సాయంత్రం 5గంటల నుంచి వివిధ వర్గాల ప్రజలు, అసోసియేట్స్ సమావేశాలలో పాల్గొననున్నారు.

విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు



కార్యక్రమంలో వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: మనూలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు–2023 నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని లైబ్రరీ ఆడిటోరియంలో ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పర్యవేక్షణలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులకు క్విజ్ పోటీ నిర్వహించారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ రఫీ మహ్మద్, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ ముజాఫర్ హుస్సేన్‌ఖాన్, డాక్టర్ జరార్ అహ్మద్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టిన మహిళలు



అంజయ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న బండి రమేష్, మహిళలు

- మొదటి రోజు ప్రచారంతో నేతల్లో పెరిగిన జోష్
- ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసిన బండి రమేశ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేశ్‌కు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ మహిళలు బ్రహ్మరథం పట్టారు. మొదటి రోజు ప్రచార కార్యక్రమంలో బండి రమేశ్‌కు అడుగడుగునా మంగళహారతులు ఇస్తూ 'మీ వెంటనే మేము'అంటూ మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడంతో కాంగ్రెస్ నాయకుల్లో జోష్ పెరిగింది. అంజయ్యనగర్‌లో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, నియోజకవర్గం ఇన్‌చార్జ్ సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో బండి రమేశ్ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ముందుగా అంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల కరపత్రాలను బండి రమేశ్ అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్ విజయాన్ని సోనియమ్మకు గిఫ్ట్‌గా ఇద్దాం...

తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి కాంగ్రెస్ విజయాన్ని గిఫ్ట్‌గా అందించాలని కోరారు. తెలంగాణ ప్రజల కష్టాలు గుర్తించి.. అమరుల త్యాగాలను చూసి.. తెలంగాణలో మరేవరూ ప్రాణాలు తీసుకోవద్దనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రాన్ని సోనియమ్మ ఇచ్చిందన్నారు. ఇది మరిచిపోయిన వారికి మనం బానిసలం కావద్దని ప్రజలకు సూచించారు. ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి చూడండి మీ కోసం ఐదేళ్లు రాజీలేకుండా మీ సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తానని హామీ ఇచ్చారు.



ప్రచారంలో బండి రమేశ్‌కు మంగళ హారతులు పడుతున్న మహిళలు

కాంగ్రెస్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది...

మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రచారం చేయడం.. ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి వస్తున్న స్పందన చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల అదరణ, ప్రేమతో విజయం సాధించి తీరుతానని బండి రమేశ్ అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి, యూత్ నాయకులు కిరణ్‌గౌడ్, ఆనంద్, అరుందీప్‌రెడ్డి, శ్రీను, షాహీన్‌షా, విజయకాంత్, అయూబ్, షరీఫుద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారు

శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్



జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శంషీగూడకు చెందిన మెతుకు కుటుంబ సభ్యులు, యువకులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం శంషీగూడకు చెందిన మెతుకు కుటుంబ సభ్యులు, పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో చేరారు. వీరందరికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, యూత్ నాయకులు ప్రణీత్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ఇతర రాష్ట్రాల ప్రజలు

కూకట్‌పల్లి: రెయిన్‌బో విస్తాస్‌లో నివసిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన పంజాబ్, మహారాష్ట్ర, బిహార్ వాసులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ జీవనం కొనసాగిస్తూ తమ కష్టసుఖాల్లో ఎప్పుడూ అండగా ఉండే ఎమ్మెల్యే కృష్ణారావుకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ హైదరాబాద్ మహానగరాన్ని అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి తీసుకొచ్చారని ఇటువంటి నాయకులు మనకి ఉండటం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో విస్తాస్ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణారావుకే మా ఓటు

అపార్టుమెంట్‌ల వాసులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దయార్‌గూడలో గ్రీన్ ఓక్ అపార్టుమెంట్, దక్షా సదన్ అపార్టుమెంట్ వాసులను గురువారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే కృష్ణారావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై తామంగా ఎమ్మెల్యే కృష్ణారావుకు మద్దతు తెలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాసుదేవ రావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో భారీగా చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆంధ్రా, రాయలసీమ వాసులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాధవరం కృష్ణారావు సమక్షంలో గురువారం పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాయలసీమ, ఆంధ్రా ప్రాంతానికి చెందిన సుమారు 100 కుటుంబాలు ఎమ్మెల్యే కృష్ణారావుకు మద్దతు తెలిపి పార్టీలో చేరాయి. సురేష్‌రెడ్డి, మాధవరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, ఫణిందర్ రెడ్డి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, బాబూరావు, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్ధార్థలో ఫ్రెషర్స్, గ్రాడ్యుయేషన్ డే





కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సిద్ధార్థ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలు, ఫైనల్ ఇయర్ విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల డైరెక్టర్ గోవర్ధని, కళాశాల ప్రెసిడెంట్ జి.భాస్కరరావు, డైరెక్టర్లు మధుసూదన్‌రావు, ఎస్.అరవింద్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.పద్మప్రియ, ఎస్. చంద్రశేఖర్‌నాథ్‌లు పాల్గొన్నా రు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌కు సంబంధించిన ముఖ్య సూచనలు తెలిపారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు మంచి ఉత్తీర్ణత శాతం వస్తున్నదని తెలిపారు.

వైభవంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లోని గంగపుత్ర సంఘం వద్ద ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పెంటయ్య, భిక్షపతి, యాదగిరి, దేవి, చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

సినీ ఫక్కీలో గంజాయి తరలింపు

అనుమానం వచ్చి తనిఖీ చేస్తే పట్టుబడ్డ 495 కిలోల గంజాయి

- ఇద్దరు నిందితుల అరెస్టు
- పరారీలో డ్రగ్ పెడ్లర్ చిన్నా

మూసాపేట: పుష్ప సినిమాలో మాదిరిగా గంజాయిని తరలిస్తున్న డీసీఎంను గురువారం కూకట్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న తరుణంలో డీసీఎం అనుమానస్పందంగా కనిపించింది. వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయటంతో సినీ ఫక్కీలో సుమారు 495 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం, పత్తిపాడు నుంచి జహీరాబాద్‌కు డీసీఎంలో గంజాయిని తరలిస్తున్నారు. విశాఖపట్టణానికి చెందిన డ్రైవర్ మైలిపల్లి రాజు (37), విశాఖపట్టణం, పీఎం పాలెంకు చెందిన కసిరెడ్డి నూతన్ రాము (48)లు డీసీఎం ట్రాలీని సుమారు 6ఇంచులకు పెంచి ఐరన్ షీట్‌ను బిగించారు. దాని కింది భాగంలో గంజాయిని ప్యాకెట్లుగా చేసి పేర్చారు. పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించి గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 495 కిలోల గంజాయి, 2 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. చిన్నా అనే డ్రగ్ పెడ్లర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కూకట్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

36.40 లక్షల గంజాయి, మద్యం సీజ్

- శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు రూ.36.40 లక్షల గంజాయి, విదేశీ మద్యం, చరస్‌లను సీజ్ చేసినట్లు శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండలంలో 109 కిలోల గంజాయి, 58 గ్రాముల చరస్, 20 లీటర్ల నాన్ డ్యూటి స్టాంప్ పెయిడ్ మద్యం, 190 లీటర్ల అక్రమ దేశీయ మద్యం, 75 లీటర్ల బీర్లు, 1130 లీటర్ల కల్లును సీజ్ చేశామన్నారు. వీటి విలువ రూ.36.40 లక్షలు ఉంటుందన్నారు. ప్రజలు తెలంగాణ ప్రభుత్వ మద్యం ఒరిజినల్ అని తెలుసుకోవడానికి 'వెరిట్' యాప్‌ను ఉపయోగించగలరని తెలిపారు. విదేశీ, అక్రమ మద్యం, గంజాయి నిల్వలు ఇతర అసాంఘిక చర్యల సమాచారం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 18004252523కు సమాచారం అందించాలన్నారు.